క్లుప్తంగా

స్థానికులకు ఉద్యోగ అవకాశాలు ఇవ్వాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : కొప్పర్తి పారిశ్రామిక వాడలో స్థానిక నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డీవైఎఫ్‌ఐ నగర కార్యదర్శి ఓబులేసు పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ నాయకులు విజయ్, ఉదయ్, సాయి, శివ పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని కళాశాలలపై చర్యలకు వినతి

వైవీయూ : వైవీయూ పరిధిలో నిబంధనలు పాటించని కళాశాలలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ నాయకులు కోరారు. శుక్రవారం వైవీయూలో పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి ఓరుగంటి నాగేంద్రబాబు తదితరులు వీసీ ఆచార్య జింక రంగ జనార్దనకు వినతిపత్రం అందజేశారు. పీడీఎస్‌యూ నాయకులు గౌస్, అల్లాభక్ష్, సురేంద్ర, విక్కీ, రెహమాన్, శ్రీనివాసులరెడ్డి, సునీల్ పాల్గొన్నారు.

సెలవులో వెళ్లిన కమిషనర్

కడప కార్పొరేషన్ : కడప నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ వారం రోజులు సెలవులో వెళ్లారు. వ్యక్తిగత పనుల నిమిత్తం ఆయన సెలవు తీసుకున్నట్లు తెలిసింది. కమిషనర్ సెలవు విషయాన్ని నగరపాలక ఉద్యోగులు గోప్యంగా ఉంచారు. కాగా ఇన్‌చార్జి కమిషనర్‌గా ఎవరిని నియమించేది ఇంకా తెలియరాలేదు.

సచివాలయాన్ని నిర్మించాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : నగరంలోని సాయిపేట హరిజన వాడలో ఉన్న ప్రభుత్వ స్థలంలో సచివాలయాన్ని, కమ్యూనిటీ హాల్‌ను నిర్మించాలని సీపీఎం నగర కార్యదర్శి రామ్మోహన్ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని సాయిపేటలోని ప్రభుత్వ స్థలాన్ని సీపీఎం నాయకులు పరిశీలించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు చంద్రా రెడ్డి, ఫరూక్ హుస్సేన్, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ మహాసభలను జయప్రదం చేయాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : ఫిబ్రవరి 15 నుంచి 18 వరకు కలకత్తా నగరంలో నిర్వహించే అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అన్వేష్ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని వ్యవసాయ కార్మిక సంఘం కార్యాలయంలో జాతీయ మహాసభలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు శివ, వెంకటేష్, నరసయ్య, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

26న కడపలో ట్రాక్టర్లతో నిరసన ర్యాలీ

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : ఈ నెల 26న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసం చేయడాన్ని నిరసిస్తూ కడప నగరంలో ట్రాక్టర్లతో నిరసన ర్యాలీ చేపడుతున్నట్లు ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ట్రాక్టర్ల ర్యాలీని రైతులు జయప్రదం చేయాలని కోరుతూ పోస్టర్లను ఆవిష్కరించారు. మోడీ ప్రభుత్వం వ్యవహరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 26న రిపబ్లిక్ డే సందర్భంగా ఐటిఐ సర్కిల్ నుంచి కలెక్టరేట్ వరకు ట్రాక్టర్లతో నిర్వహిస్తున్న ర్యాలీని జయప్రదం చేయాలన్నారు. ఏపీ రైతు సంఘం నాయకులు ఎంవి సుబ్బారెడ్డి, దస్తగిరి రెడ్డి, అన్వేష్, మనోహర్ రెడ్డి, వెంకట సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

జాబ్ క్యాలండర్ విడుదల చేయాలి

వైవీయూ : రాష్ట్ర ప్రభుత్వం జాబ్ క్యాలండర్ విడుదల చేయాలని డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వి. శివకుమార్ కోరారు. శుక్రవారం యోగి వేమన విశ్వవిద్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగాల కోసం శిక్షణ పొందుతూ, ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే జాబ్ క్యాలండర్‌ను విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో షాకీర్, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

24 నుంచి శ్రీ రాజేశ్వరీదేవి ఆలయ వార్షికోత్సవం

కడప కల్చరల్ : కడప నగరం మున్సిపల్ మైదానంలోని శ్రీ రాజరాజేశ్వరీదేవి ఆలయ ప్రతిష్ఠాపన వార్షికోత్సవం ఈనెల 24వ తేది నుంచి 25వ తేది వరకు నిర్వహించనున్నామని ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కొప్పరపు ఉమేష్ తెలిపారు. శుక్రవారం ఈ మేరకు ఆలయంలో ఉత్సవాల కరపత్రాలను వారు ఆలయ అర్చకులు పిడతల గోపాలకృష్ణ, మురళీకృష్ణశర్మ, ఇతర ట్రస్టు సభ్యులతో కలిసి ఆవిష్కరించారు.

బహుమతుల ప్రదానం

కడప కార్పొరేషన్ : కడప నగరంలోని నాగరాజుపేట మున్సిపల్ హైస్కూలులో ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయం ఆధ్వర్యంలో స్వచ్ఛత కార్యక్రమంపై విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. శుక్రవారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి బ్యాంకు చీఫ్ మేనేజర్ కె.పుల్లయ్య, అసిస్టెంట్ మేనేజర్ జె.రామరాజు, ప్రధానోపాధ్యాయురాలు కవిత పాల్గొని విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలను స్వచ్ఛత కార్యక్రమ ఉద్దేశాలను వివరించారు. విజేతలుగా నిలిచిన వారిలో జయంతి (7వ తరగతి), పవన్‌కుమార్ (8వ తరగతి), హేమలత (8వ తరగతి)లు మొదటి మూడు స్థానాల్లో నిలిచారు.

ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు

డిప్యూటీ సీఎం అంజద్‌బాషా



'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో ప్రజలతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్ : ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబానికి రూ.1లక్ష నుంచి రూ.10లక్షల వరకూ లబ్ధి కలిగిందని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా అన్నారు. శుక్రవారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా 41వ డివిజన్ పరిధిలోని రవీంద్రనగర్‌లో జమాల్ హెల్త్ కేర్ తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల వారికి కలుగుతున్న లబ్ధిని తెలుసుకున్నారు. అర్హులందరికీ పథకాలు వర్తింపజేయాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. షేక్ నజీమా బేగం అనే మహిళ మాట్లాడుతూ తమకు వైఎస్సార్ చేయూత పథకం వర్తించలేదని, అయినా పడినట్లు చూపుతున్నారని తెలిపింది. దీనిపై డిప్యూటీ సీఎం స్పందిస్తూ విచారణ చేసి ఎవరి ఖాతాలో పడిందో తెలియజేయాలని సూచించారు. నసీంఖాన్ అనే వృద్ధుడు మాట్లాడుతూ తమ ఇంటి ఎదురుగా రోడ్డుకు అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని తొలగించాలని కోరారు. షేక్ ఆశా బీ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత వైఎస్సార్ పింఛన్ కానుక, వైఎస్సార్ ఆసరా, సున్నావడ్డీ, వైఎస్సార్ చేయూత, ఇంటి స్థలం ద్వారా తమ కుటుంబానికి రూ.12.12లక్షల లబ్ధి కలిగిందని సంతోషం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ ప్రజలకు మేలు చేయాలన్న సంకల్పంతో పనిచేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖ సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, 41వ డివిజన్ ఇన్‌చార్జి, మాజీ కార్పొరేటర్ జమాల్‌వలీ, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కాల్‌టెక్స్ హఫీజుల్లా, బంగారునాగయ్య, తోటక్రిష్ణ, సుబ్బారెడ్డి, ఉమైర్, పస్తం ఆంజి, రహీమ్, అర్జున్, మునిశేఖర్ రెడ్డి, టీపీ వెంకట సుబ్బమ్మ, బండి మరియలు, రామలక్షుమ్మ, నారాయణమ్మ, చైతల్య పాల్గొన్నారు.

సమాజానికి ఉపయోగపడే పరిశోధనలు రావాలి

ఉన్నత విద్య ఆర్‌జేడీ డా. పి. బాబు



మాట్లాడుతున్న ఉన్నత విద్య ఆర్‌జేడీ డా. పి. బాబు

వైవీయూ : సమాజానికి ఉపయోగపడే పరిశోధనలు రావాలని ఉన్నత విద్య కడప రీజినల్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ పి. బాబు సూచించారు. కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో నిర్వహిస్తున్న 'రీసెంట్ ట్రెండ్స్ ఇన్ జెనిటిక్స్' వర్క్‌షాపు ముగింపు సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌జేడీ మాట్లాడుతూ విద్యార్థులలో సైన్స్ పట్ల అవగాహన పెంపొందిస్తూ నూతన పరిశోధన అంశాలను తెలియజేసేందుకు ఇలాంటి వర్క్‌షాపులు దోహదం చేస్తాయన్నారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్ మాట్లాడుతూ వర్క్‌షాపులో విద్యార్థులు, అధ్యాపకులు నూతన అంశాలను నేర్చుకోగలిగారన్నారు. విద్యార్థుల కోసం సైన్స్ అకాడమీ చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. మైసూరు విశ్వవిద్యాలయం ఆచార్యులు డా. ఎన్.బి. రామచంద్ర మాట్లాడుతూ జన్యుశాస్త్రంలో జరుగుతున్న పరిశోధనలు అనేక జన్యు సంబంధమైన సమస్యలకు పరిష్కారం చూపుతున్నాయన్నారు. రీసోర్స్‌పర్సన్‌గా విచ్చేసిన ఐఐఎస్సీ బెంగుళూరు ఆచార్యులు డా. ఎస్. ఉపేంద్ర జన్యుపరమైన వ్యాధులకు క్రిస్పర్ క్రాస్ విధానంలో ఎలా చికిత్స చేస్తారో విద్యార్థులకు వివరించారు. సెంటర్ ఫర డీఎన్‌ఏ ఫింగర్ ప్రింటింగ్ అండ్ డయాగ్నస్టిక్‌కు చెందిన డాక్టర్ ఎం. సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఏపీ జెనిటో బెంజీన్ అన్న అంశంపై అవగాహన కల్పించారు. వీరితో పాటు యూనివర్సిటీ ఆఫ్ మైసూరుకు చెందిన డా. శివానందప్ప, వర్కుషాప్ కన్వీనర్ డా. పి. కల్పన ఉపన్యసించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డా. ఎన్. వెంకటరామిరెడ్డి, డా. అనుప్రసన్న, రవిశేఖర్, సావిత్రి, నరసింహారావు, కృష్ణారెడ్డి, రాజశేఖరరెడ్డి, శ్రీనీత, శచీదేవి, ప్రియదర్శిణి, సత్యనారాయణరెడ్డి, రాజీవ్‌బాబు, హజరతయ్య తదితరులు పాల్గొన్నారు.

'బ్రౌన్' జయంతిని ప్రభుత్వ పక్షాన నిర్వహించాలి

కడప కల్చరల్ : తాటి ఆకుల్లో మగ్గిపోతున్న తెలుగు సాహిత్యాన్ని ఉద్ధరించిన మహనీయుడు, తెలుగుసూర్యునిగా ఖ్యాతి పొందిన సీపీ బ్రౌన్ జయంతి, వర్ధంతులను ప్రభుత్వ పక్షాన నిర్వహించాలని బ్రౌన్ గ్రంథాలయ సలహా మండలి సభ్యులు జానమద్ది విజయభాస్కర్ విన్నవించారు. శుక్రవారం ఆయన ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి లేఖ రాశారు. వేమన జయంతిని ప్రభుత్వం నిర్వహించి ఉత్తమ సంప్రదాయానికి నాంది పలికిన ప్రభుత్వం, తెలుగు భాషోద్ధారకుడైన సీపీ బ్రౌన్ జయంతి, వర్ధంతులనుకూడా నిర్వహించాలని కోరారు.

రూట డైరీ ఆవిష్కరణ



రూట నాయకులతో కలిసి డైరీని ఆవిష్కరిస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ

కడప ఎడ్యుకేషన్ : ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి, ఉర్దూ పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తోందని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. శుక్రవారం సూర్యారావుపేటలోని ఆయన క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్(రూట) -2023 నూతన డైరీని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, రూట రాష్ట్ర అధ్యక్షుడు లయన్ ఇమామ్‌బాష, స్టేట్ అసోసియేట్ ప్రెసిడెంట్ అబ్దుల్ మానాఫ్‌లు ఆవిష్కరించారు. రాష్ట్రంలోని ఉర్దూ పాఠశాలల, ఉపాధ్యాయుల సమస్యలను గురించి మంత్రి దృష్టికి తీసుకు వెళ్లగా సమస్యల పరిష్కారంపై ఆయన సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. ఈ డైరీ ఆవిష్కరణలో రాష్ట్ర అసిస్టెంట్ ఫైనాన్స్ సెక్రటరీ ఎండి షరీఫ్, ఎన్‌టిఆర్, కృష్ణా జిల్లాల ప్రధాన కార్యదర్శులు షేక్ ఇక్బాల్‌పాషా, షేక్ మాలిక్, ఆర్థిక కార్యదర్శి సయ్యద్ హఫీజ్ తదితరులు పాల్గొన్నారు.

దర్గా వద్ద మరుగుదొడ్ల నిర్మాణం తగదు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: నగరంలోని హజరత్ సయ్యద్ మెహర్ ఆలీషా దర్గా వద్ద మరుగుదొడ్లను నిర్మించడం తగదని ఆప్‌కీ ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి మగ్బూల్ బాష పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని ఆప్‌కీ ఆవాజ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎంతో చరిత్ర కలిగిన ఆలీషా దర్గాను ఆనుకొని కార్పొరేషన్ అధికారులు మరుగు దొడ్లు నిర్మించడం శోచనీయమన్నారు. క్షేత్రంలో పక్కనున్న స్థలంలో మరుగు దొడ్లు నిర్మిస్తే ఎవరికి అభ్యంతరం ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో ఆప్‌కీ ఆవాజ్ నాయకులు అబిద్, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు సహాయక కేంద్రాల ఏర్పాటు

ప్రొద్దుటూరు క్రైం : ఈ నెల 22న కానిస్టేబుల్ పరీక్ష రాయడానికి ప్రొద్దుటూరుకు వస్తున్న అభ్యర్థుల కోసం పోలీసు సహాయక కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాలను గుర్తించడంలో కానీ, అక్కడికి చేరుకునే విషయంలో అభ్యర్థులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు వీటిని ఏర్పాటు చేస్తున్నట్లు ఏఎస్పీ ప్రేరణాకుమార్ తెలిపారు. ఆర్టీసీ బస్టాండు, రాజీవ్ సర్కిల్, రైల్వే స్టేషన్‌ల వద్ద సహాయక కేంద్రాలను ఏర్పాటు చేశారు. పోలీసు సహాయం కోసం 9121100702 అనే కమాండ్ కంట్రోల్ నంబర్‌లో సంప్రదించాలన్నారు.

మట్కా నిర్వాహకులు అరెస్ట్

కడప అర్బన్ : కడప నగరంలోని మోచంపేటలో మట్కా నిర్వహిస్తున్న షేక్ ఇక్బాల్‌బాషాను కడప టూటౌన్ సీఐ సయ్యద్ హాసం తన సిబ్బందితో కలిసి శుక్రవారం రాత్రి అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి రూ.23,400 నగదును, మట్కా స్లిప్‌లను స్వాధీనం చేసుకున్నారు. అలాగే పాత బస్టాండ్ వద్ద రాధాకృష్ణనగర్‌కు చెందిన మదార్ సాహెబ్ అనే మట్కా నిర్వాహకుడు మట్కా రాస్తుండగా ఎస్ఐ సిద్దయ్య తమ సిబ్బందితో కలిసి వెళ్లి అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి రూ. 10 వేలు నగదును స్వాధీనం చేసుకున్నట్లు కడప ఒన్‌టౌన్ ఎస్ఐ సిద్దయ్య తెలియజేశారు.

ప్రతి వాహనానికి బీమా ఉంటే ధీమా



మాట్లాడుతున్న జిల్లా ఉప రవాణా శాఖ కమిషనర్ మీరా ప్రసాద్

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : రోడ్డుపై తిరిగే ప్రతి వాహనానికి బీమా ఉంటేనే ధీమాగా ఉంటుందని జిల్లా ఉప రవాణా శాఖ కమిషనర్ ఇ. మీరా ప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల సందర్భంగా నగర శివార్లలోని ఊటుకూరు జిల్లా ఉప రవాణాశాఖ కమిషనర్ కార్యాలయంలో రహదారి భద్రత–మోటారు వాహనాల ఇన్సూరెన్స్ ఆవశ్యకతపై పలు ఇన్సూరెన్స్ కంపెనీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు తప్పకుండా బీమా కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ ప్రతాప్ కుమార్ రెడ్డి, నేషనల్ ఇన్సూరెన్స్ బ్రాంచ్ మేనేజర్ వసంత కుమార్, ఎంవీఐలు విజయ్ భాస్కర్, ఏఎంవీఐ లక్ష్మీ ప్రసన్న, ఏవో ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయ విజ్ఞాన సదస్సు



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి కవిత

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్‌జడ్జి కవిత శుక్రవారం కడపలోని పురుషులు,మహిళల కేంద్ర కారాగాలను సందర్శించి న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహించారు. జడ్జి కవిత మాట్లాడుతూ ఉచిత న్యాయ సహాయంతోపాటు పలు అంశాలపై వారికి అవగాహన కల్పించారు. అలాగే పారా లీగల్ వాలంటీర్లు, లీగల్ ఎయిడ్ క్లినిక్స్ విధి విధానాలను తెలియజేశారు. ఏవైనా సమస్యలు ఉంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప వారిని సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జైలు అధికారులు, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ హరిబాబు, ఖైదీలు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్ డబ్బులు జమ

కడప ఎడ్యుకేషన్: నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ 2020-21, 2021-22 విద్యా సంవత్సరానికి సంబంధించి స్కాలర్‌షిప్ పరీక్షలో ఎంపికై .. నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో రిజిస్టర్ చేసుకున్న ఫ్రెష్ అండ్ రెన్యువల్‌కు సంబంధించిన స్కాలర్‌షిప్ రుసుము విద్యార్థుల బ్యాంకు ఖాతాలకు జమ అయినట్లు డీఈఓ దేవరాజు తెలిపారు. బ్యాంకు ఖాతా వివరాలు తప్పుగా నమోదు చేసుకున్న వారికి నగదు జమచేయడం వీలుకాకపోవడం వల్ల ఆయా విద్యార్థుల మొబైల్ నెంబర్‌కు ఎస్ఎంఎస్ పంపినట్లు తెలిపారు. కావున స్కాలర్‌షిప్ జమ కాని వారు వెంటనే స్టూడెంట్ లాగిన్‌లో కేంద్ర విద్యామంత్రిత్వశాఖ వారు ఇచ్చిన ఆదేశాలను అనుసరించి వివరాలను సరిచేసుకోవాలని తెలిపారు. నగదు జమ కాకపోవడానికి గల కారణాలను స్టూడెంట్ లాగిన్‌లో మాత్రమే ఉందని, విద్యార్థుల తల్లితండ్రులు, సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఈ విషయంపై శ్రద్ధ తీసుకుని తరచూ విద్యార్థికి సంబంధించిన లాగిన్‌ను తనిఖీ చేయాలని డీఈఓ దేవరాజు సూచించారు.

ఉత్సాహంగా బ్యాడ్మింటన్ టోర్నీ



జిల్లా స్థాయి విజేతలతో శిక్షకులు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని వైఎస్‌ఆర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన శాప్ లీగ్ జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ఉత్సాహంగా సాగింది. ఈ ఎంపికలను బ్యాడ్మింటన్ అంతర్జాతీయ రెఫరీ ఎస్.జిలానీబాషా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారుల్లోని నైపుణ్యాలను వెలికి తీసేందుకు శాప్‌లీగ్స్ దోహదం చేస్తాయన్నారు. జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు ఈ నెల 21న విజయవాడలో నిర్వహించే రాష్ట్రస్థాయి శాప్‌లీగ్ పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు. అనంతరం పోటీలు నిర్వహించి విజేతలకు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో డీఎస్ఏ చీఫ్ కోచ్ ఎన్.వి.పి. అమృత్‌రాజ్, బ్యాడ్మింటన్ కోచ్‌లు సుదర్శన్, జాకీర్‌హుస్సేన్, శ్రీనివాసరాజు, శ్యామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

విజేతల వివరాలు (వరుసగా ప్రథమ, ద్వితీయ)

అండర్–13 బాలుర సింగిల్స్ : ఎస్ఎండీ అహిల్, సాయి హేనిత్‌రెడ్డి **అండర్–13 బాలికలు సింగిల్స్ :** కె.ప్రణవి, పి.ఆయేషా ముస్కర్ **అండర్–13 బాలురు డబుల్స్ :** డి.ఎల్.విశ్వనాథ్‌రెడ్డి–హినేత్‌రెడ్డి, ఎస్ఎండీ అహిల్–శివశక్షిల్‌రెడ్డి **అండర్–13 బాలికల డబుల్స్ :** కె.ప్రణవి–పి.ఆయేషాముస్కర్ **అండర్–17 బాలుర సింగిల్స్ :** జి.ప్రవీణ్, జి.యోగప్రశాంత్‌రెడ్డి **అండర్–17 బాలికల సింగిల్స్ :** పి.శ్రీవల్లి, ఎస్.డి.మెహజబీన్ **అండర్–17 బాలికల డబుల్స్ :** పి.శ్రీవల్లి–చెరిష్మా, కె. ప్రణవి–వై.హన్సిక **పురుషుల సింగిల్స్ :** కె. గిప్సన్, ఆర్. రెడ్డిప్రవీణ్.

ఎల్ఐసీ వ్యాపారాభివృద్ధికి 'లియాఫీ' కృషి



మాట్లాడుతున్న జయభారత్‌రెడ్డి

కడప కల్చరల్ : జీవిత బీమా సంస్థలో వ్యాపారం అభివృద్ధి చెందేందుకు లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (లియాఫీ) కృషి చేస్తుందని ఆ సంస్థ డివిజన్ అధ్యక్షులు జయభారత్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం కడప నగరంలోని విశ్వేశ్వరయ్య భవన్‌లో సంస్థ కడప డివిజన్ రెండవ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెంట్లకు మెడిక్లెయిమ్‌లు చెల్లించాలని, డెత్‌క్లెయిమ్‌లు త్వరగా పరిష్కరించాలని కోరారు. గ్రూప్ ఇన్సూరెన్స్ మొత్తాన్ని పెంచాలన్నారు. డెవలప్‌మెంట్ ఆఫీసర్ల పోస్టులలో ఏజెంట్లకు 25 శాతం రిజర్వేషన్ ఉందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎస్‌డీఎం గిరిధర్ మాట్లాడుతూ సంస్థ అభివృద్ధిలో ఏజెంట్ల పాత్ర కీలకమన్నారు. వ్యాపారాన్ని పెంచి కడప డివిజన్‌ను ప్రథమ స్థానంలో నిలపాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంస్థ ఆలిండియా ప్లానింగ్ కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి, జోనల్ చైర్మన్ కృష్ణారెడ్డి, డివిజన్ కార్యదర్శి కదిరప్ప, కోశాధికారి కృష్ణ, ఇతర ప్రతినిధులు నాగశివారెడ్డి, మాధవి, ఇస్మాయిల్, నిత్యానందరెడ్డి, రాజేంద్ర, రామచంద్రారెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, చెన్నయ్య, ఈశ్వర్‌రెడ్డి, ఇంకా పలువురు ఏజెంట్లు పాల్గొన్నారు.

సైబర్ క్రైమ్ అధికారులకు ప్రశంసాపత్రాల అందజేత



ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న సైబర్ క్రైమ్ టెక్నికల్ విభాగం సీఐ శ్రీధర్‌నాయుడు

కడప అర్బన్ : జిల్లాలో మొబైల్ మిస్సింగ్ ట్రాకింగ్ సిస్టంను ప్రారంభించిన నెలరోజుల్లోనే దాదాపు రూ. 30 లక్షల విలువైన 130 సెల్‌ఫోన్‌లను జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆదేశాల మేరకు జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) తుషార్ డూడీ ఆధ్వర్యంలో సైబర్ క్రైమ్ విభాగం అధికారులు రికవరీ చేశారు. ఈ రికవరీలో విశేష కృషి చేసిన ఫ్యాక్షన్ జోన్ డీఎస్పీ చెంచుబాబు, సైబర్‌క్రైమ్ టెక్నికల్ విభాగం ఇన్‌స్పెక్టర్ వి. శ్రీధర్‌నాయుడు, ఎస్ఐలు మధుమల్లేశ్వర్ రెడ్డి, రవికుమార్, ఆర్ఎస్ఐ శ్రీనివాసులు, కానిస్టేబుళ్లు శ్రీనివాసులు, శ్యాం, నరహరిలకు జిల్లా ఎస్పీ ప్రశంసాపత్రాలను అందజేసి ప్రత్యేకంగా అభినందించారు.

వైవీయూతో ఎల్ఎల్‌సీ లాంచ్‌ప్యాడ్ సంస్థ ఎంఓయూ

ఒప్పందం కుదుర్చుకున్న అధికారులు



వీసీ సమక్షంలో ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న రిజిస్ట్రార్, లాంచ్‌ప్యాడ్ సంస్థ ప్రతినిధులు

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయంలో విద్యను అభ్యసించే విద్యార్థులు, అధ్యాపకులకు నైపుణ్యాభివృద్ధిపై శిక్షణ అందించేందుకు లాంచ్‌ప్యాడ్ ఎల్ఎల్‌సీ అనే సంస్థతో విశ్వవిద్యాలయం ఒప్పందం కుదుర్చుకుంది. విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఆచార్య జింక రంగ జనార్ధన సమక్షంలో రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, లాంచ్‌ప్యాడ్ ఎల్ఎల్‌సీ సంస్థ ప్రాంతీయ అధ్యక్షుడు శివకుమార్‌లు ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఈ ఒప్పందం విద్యార్థులకు ఉపాధి నైపుణ్యాలను పెంపొందించడంతో పాటు పరిశ్రమలకు సంబంధించిన నైపుణ్యాలను మెరుగుపరుచుకునేందుకు దోహదం చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఆచార్య కె. శ్రీనివాస్, సీడీసీ డీన్ ఆచార్య వై. సుబ్బరాయుడు, ఐక్యూఏసీ డైరెక్టర్ డా. ఎల్. సుబ్రమణ్యంశర్మ, ఆర్ అండ్ డీ డైరెక్టర్ ఆచార్య పి. చంద్ర ఓబుల్‌రెడ్డి, పీఆర్ సెల్ డైరెక్టర్ డా. ఎస్.వి. సుబ్బారెడ్డి, స్కిల్ డెవలప్‌మెంట్ కోఆర్డినేటర్ సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహాశివునికి విశేష అభిషేకం



శివునికి అభిషేకం నిర్వహిస్తున్న భక్తులు

కడప కల్చరల్ : కడప నగరం మున్సిపల్ మైదానంలోని శ్రీ రాజరాజేశ్వరీదేవి ఆలయ ప్రాంగణంలోగల శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామికి శుక్రవారం మాస శివరాత్రిని పురస్కరించుకుని అభిషేకాలు నిర్వహించారు. భక్తులే స్వయంగా స్వామిని అభిషేకించుకునే అవకాశం కల్పించారు. దాంతో భక్తులు కుటుంబాలుగా తరలివచ్చి స్వామిని స్వయంగా అభిషేకించారు. అనంతరం స్వామిని పూలమాలలు, ఆభరణాలతో కనుల పండువగా అలంకరించి మారేడు దళాలతో అష్టోత్తర నామావళి, ధూప దీప నైవేద్యం, మహామంగళహారతి తదితరాలతో పూజలు నిర్వహించారు. హాజరైన భక్తులందరికీ తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఎలక్ట్రీషియన్ల దినోత్సవాన్ని జయప్రదం చేయాలి

కడప కార్పొరేషన్ : ఎలక్ట్రీషియన్ దినోత్సవాన్ని ఎలక్ట్రీషియన్లు, ప్లంబింగ్‌వర్కర్లు జయప్రదం చేయాలని కడప జిల్లా ప్రైవేటు ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పవర్ అల్తాఫ్ పిలుపునిచ్చారు. శుక్రవారం సాయంత్రం డిప్యూటీ సీఎం క్యాంపు కార్యాలయంలో ఎలక్ట్రీషియన్ యూనియన్ నగర కమిటీ ఆధ్వర్యంలో ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా చేతుల మీదుగా పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 27వ తేది ఉదయం 8 గంటలకు స్థానిక మద్రాసు రోడ్డులోని నూర్–ఏ– జహాన్ హాల్‌లో ఎలక్ట్రీషియన్ డే నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఆర్‌వీ రమణ, సుభాన్‌బాషా, గౌస్, నగర అధ్యక్షుడు నరేంద్రకుమార్(చిట్టి), ఉపాధ్యక్షుడు మహబూబ్ షరీఫ్, ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, జిల్లా, నగర కార్యవర్గసభ్యులు పాల్గొన్నారు.

ఆస్పత్రి రికార్డులను సక్రమంగా నిర్వహించాలి

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి నాగరాజు



దువ్వూరులో మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి నాగరాజు

దువ్వూరు : ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రికార్డులను సక్రమంగా నిర్వహించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి నాగరాజు పేర్కొన్నారు. మండల కేంద్రమైన దువ్వూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం జిల్లా వైద్యాధికారి నాగరాజు, జిల్లా నేషనల్ హెల్త్ ప్రోగ్రాం అధికారి నాగశిభూషణ్‌రెడ్డి సందర్శించారు.

ఈ సందర్భంగా వారు మాట్లడతూ ఆస్పత్రికి వచ్చే రోగులకు, గర్భవతులకు సరైన సమయంలో వైద్యం అందించి వారి వివరాలను తప్పకుండా రికార్డు చేయాలని సిబ్బందికి సూచించారు. జాతీయ ఆరోగ్య మిషన్ కింద చేపట్టిన పథకాలను వంద శాతం నిర్వహించాలని తెలిపారు. ఆస్పత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి డాక్టర్లు సురేష్‌బాబు, సమీర, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై అవగాహన పెంచుకోవాలి

ఖాజీపేట : ఇంటి శుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రతను అందరూ పాటించాలి, అలాగే పారిశుద్ధ్యం పై అందరూ అవగాహన పెంచుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. నాగరాజు అన్నారు. శుక్రవారం ఆయన ఖాజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిశీలించారు. అగ్రహారంలో పారిశుద్ధ్యం పరిశీలించారు. స్థానికులకు ఆయన సూచనలు చేశారు. ప్రతి ఫ్రైడే ని డ్రైడేగా అందరూ పాటించాలని అన్నారు. దోమతెరలను తప్పకుండా వాడాలని అన్నారు. దోమల కాటు వలన అనేక రోగాలు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి రాఘవయ్య, డీపీఎంఓ శశిభూషన్‌రెడ్డి, డాక్టర్ మునీబ్, నాగభూషణం, సూపర్‌వైజర్ కృష్ణప్రియ, సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

పదిలో ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించాలి

ఉపాధ్యాయులతో డీఈఓ దేవరాజు



పదో తగరతి విద్యార్థులతో ముఖాముఖి నిర్వహిస్తున్న డీఈఓ దేవరాజు

కడప ఎడ్యుకేషన్ : జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతి విద్యార్థి పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈఓ దేవరాజు పేర్కొన్నారు. శుక్రవారం కడపలోని నగరపాలక ఉన్నత పాఠశాల మెయిన్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం నాగమణి ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఒక ప్రణాళికతో పరీక్షలకు సిద్ధం కావాలన్నారు. వెనుక బడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలలో అమలవతున్న మధ్యాహ్న భోజనాన్ని డీఈఓ తనిఖీ చేశారు. మెనూ ప్రకారం పెడుతున్నారా లేదా అని ఆరా తీశారు. ఎంఈఓ పాలెం నారాయణ, హెచ్‌ఎం నాగమణి పాల్గొన్నారు.